




RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 53

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 23 జూలై 2026


## ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ..
## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం

- ఢిల్లీలో ప్రధానితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా





**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను

## భూ రికార్డుల శాశ్వత భద్రతకు బ్లాక్‌చెయిన్

- రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా 'మీభూమి--బ్లాక్‌చెయిన్' పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం
- 7 జిల్లాల పరిధిలోని 7 మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ అమలు
- భూ రికార్డులకు 'సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్'గా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్ట్
- భూ మోసాలకు చెక్... వేగవంతమైన, పారదర్శక సేవలే లక్ష్యం



**అమరావతి, కలంకౌంటర్ :** భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే 'మీభూమి--బ్లాక్ చెయిన్' వ్యవస్థను ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించను న్నారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదు-రవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి--బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు. ఆంధ్రప్రదేశ్, ఎన్ ఐ సి బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్-ప్రూఫ్, సెక్యూర్టీతో జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది. ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్‌తో సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్-డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీ-సర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ అవుతున్నాయి.

## భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష

- 3లో

## జగన్‌కు పొగాకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు...
## నీ హయాంలో కంటితుడుపు చర్యలే -- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫైర్

- రైతుల కోసం పని చేసింది టీడీపీ ప్రభుత్వం... రైతులను గాలికొదిలింది జగన్ ప్రభుత్వం
- నాడు మార్కెట్ జోక్యంతో రైతులను ఆదుకున్నాం... నేడు రూ.300 కోట్లతో హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు చేశాం
- ఇప్పుడు ఎఫ్ సీ వీ పొగాకు రైతులకు అండగా నిలుస్తున్నాం
- నీ హయాంలో రైతులు విలవిల్లాడితే చూస్తూ ఊరుకున్నావు... ఇప్పుడు మమ్మల్ని విమర్శించే అర్హత ఎక్కడిది?



**అమరావతి, కలంకౌంటర్ :** పొగాకు రైతుల సంక్షేమం కోసం నిజంగా పనిచేసింది తెలుగుదేశం ప్రభుత్వం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మాత్రమేనని, రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఇప్పుడు నీతులు చెప్పడం గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏమాత్రం తగదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. జగన్ హయాంలో పొగాకు రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయినా స్పందించ లేదని, చేసిన కొనుగోళ్లు కూడా కేవలం కంటితుడుపు చర్యలుగా మాత్రమే మిగిలిపోయాయని మండిపడ్డారు. రైతుల కష్టాలు పట్టించుకోకుండా ఐదేళ్లు గడిపిన జగన్... ఇప్పుడు రైతులపై ప్రేమ ఒలకబోస్తూ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా జోక్యం చేసుకుని పొగాకు రైతులను ఆదుకున్నామని మంత్రి గుర్తు చేశారు. 2014-15 పంట సీజన్‌లో పొగాకు కిలోకు రూ.20 చొప్పున ధరల పరిహారం అందించామని తెలిపారు. అయితే 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 12.93 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేయటం తప్పా , రైతులకు నిజమైన ఉపశమనం కలిగించే విధంగా మార్కెట్‌లో సమర్థవంతమైన జోక్యం చేయలేకపోయిందన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయిన సమయంలో వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పొగాకు రైతుల సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని చర్యలు ప్రారంభించిందని మంత్రి తెలిపారు. గత ఏడాదిలోనే సుమారు 35 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును రూ.300 కోట్ల విలువతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. అదే విధంగా వర్జీనియా పొగాకు రైతుల సమస్యల పరిష్కారంలో కూడా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తిపై కేంద్ర వాణిజ్య ఢ పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ వెంటనే స్పందించి, పొగాకు కొనుగోలు చేస్తున్న అన్ని కంపెనీలకు రైతుల వద్ద ఉన్న మొత్తం వర్జీనియా పొగాకు పంటను కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్ సీ వీ పొగాకు రైతులను ఖచ్చితంగా అదుకుంటామని, కేంద్ర మంత్రి ఆదేశాలకు కంపెనీలు కూడా సానుకూలంగా స్పందించి రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేసేందుకు అంగీకారం తెలిపాయని చెప్పారు. జగన్ సిండికేట్‌ల గురించి మాట్లాడటం హాస్యాస్పదం. నీ పాలనంతా దోచుకోవడం, దాచుకోవడం, సిండికేట్ రాజకీయాలకే పరిమితమైనం దున

- 2లో

## దుబ్బ దానయ్య కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి కొలుసు పార్థసారథి



**పలాస,కలంకౌంటర్ :** పలాసలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుబ్బ దానయ్య కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార ఢ పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి , తమ తండ్రి దివంగత కొలుసు పెద్ద రెడ్డయ్య యాదవ్ స్మారకార్థం నిర్వహిస్తున్న కొలుసు పెద్ద రెడ్డయ్య యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షలు, అలాగే యాదవ్ సంఘం తరపున రూ.3 లక్షలు, మొత్తం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష , కూటమి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, అవసరమైన సహాయ సహకారాలు అందేలా తాను వ్యక్తిగతంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.




## ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ..
## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం



(మొదటిపేజీ తరువాయి)

కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు. విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల విజ్ఞాన యాత్ర



**జంగారెడ్డిగూడెం,కలంకౌంటర్ :** చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్. ప్రసాద్ బాబు అధ్యక్షతన కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం పురపాలక కార్యాలయాన్ని కళాశాల సందర్శించారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి విజ్ఞాన యాత్రల వల్ల స్థానిక పరిపాలన వ్యవస్థ ఎలా ఉంటుందో దాని కార్యకలాపాలు ఎలా ఉంటాయో విద్యార్థులు తెలుసుకోగలుగుతారు అన్నారు. అధికార వికేంద్రీకరణలో భాగంగా పురపాలక సంఘాలు వెలిశాయని పురపాలక సంఘాలు నగరభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నాయని వీటిని సందర్శించడం వలన విద్యార్థులకు పరిపాలన పట్ల సంక్షేమ కార్యక్రమాల పట్ల అవగాహన కలుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకులు ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పురపాలక సంఘాల వల్ల పట్టణ ప్రజలకు ఎన్నో సౌకర్యాలు నెరవేరుతున్నాయని విద్యార్థులు పురపాలక సంఘాలను దర్శించడం వల్ల పురపాలక సంఘాలు వాటి అధికార పరిధి పురపాలక సంఘాలు స్లమ్ ఏరియా ను ఏ విధంగా అభివృద్ధి చేస్తున్నాయి అన్న విషయాన్ని విద్యార్థులు తెలుసుకోగలరు అన్నారు. ఈ సందర్భంగా పురపాలక కార్యాలయంలో కమీషనర్ రమణ విద్యార్థులకు పురపాలక సంఘ ప్రాముఖ్యతను గురించి వివరించారు. తదనంతరం విద్యార్థులు వివిధ విభాగాలను సందర్శించి పరిపాలన సంబంధించిన అనేక విషయాలను తెలుసుకున్నారు.

## పట్టణాభివృద్ధికి ప్రజా సహకారం అవసరం



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రజా సహకారం అవసరమని ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్ మండ సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కు ఇటీవల గుడివాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న సుభాష్ చంద్రబోస్ ను బుధవారం స్థానిక దుర్గా ఎస్టేట్ వాసులు ఘనంగా సత్కారించారు. కాలనీ వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ ప్రజల సౌకర్యార్థం కష్టసాధ్యమైనప్పటికీ వారికి అవగాహన కలిగించి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తున్నానని ఉయ్యూరు ప్రజలు పూర్తి సహకారాన్ని అందిస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రామినేని కుటుంబయ మాట్లాడుతూ కమిషనర్ మరింత మెరుగ్గా సేవలు అందించి మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త జంపాల శ్రీనివాస్ గౌడ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత కావాలి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే ఆరోగ్యకర సమాజం నెలకొంటుందని పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరు అనుసరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జివిస్వి శేషగిరిరావు కోరారు మండలంలోని పెదఓగిరాల గ్రామంలో బుధవారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని పారిశుధ్య కార్మికులతో కలిసి స్వయంగా రోడ్లు ఊడ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పారిశుధ్య విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, పారిశ్జానికి విఘాతం కలిగించే వారిపై పంచాయతీరాజ్ చట్టం కింద చర్యలు చేపట్టవలసిందిగా అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సచివాలయ సిబ్బంది పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సాగునీటి చెరువుల అభివృద్ధే లక్ష్యం ..

● సంఘాల అధ్యక్షులతో మంత్రి సవిత సమీక్ష ● రూ.3 కోట్లతో పెనుకొండ నియోజకవర్గంలో సాగునీటి చెరువుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం మంత్రి సవిత





**పెనుకొండ,కలంకౌంటర్ :** సాగునీటి చెరువుల అభివృద్ధే లక్ష్యం మని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత సాగునీటి చెరువు సంఘాల అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సాగునీటి చెరువుల పరిస్థితి, రైతులకు సాగునీటి అందుబాటు, చెరువుల నిర్వహణ, అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. మంత్రి సవిత మాట్లాడుతూ, పెనుకొండ నియోజకవర్గంలో సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న చెరువుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ పనుల ద్వారా చెరువుల నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు రైతులకు సాగునీటి సమస్యలు తగ్గి వ్యవసాయ ఉత్పాదకత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అలాగే, చెరువు సంఘాల అధ్యక్షులు గ్రామ స్థాయిలో సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించి, ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ వ్యాప్తంగా చెరువుల అభివృద్ధికి సంబంధించిన పలు సూచనలు, సమస్యలను సంఘాల అధ్యక్షులు మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సాగునీటి చెరువు సంఘాల అధ్యక్షులు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# హజ్-2027 యాత్ర దరఖాస్తుకు రేపు ఆఖరి రోజు

-మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి



**అమరావతి,కలంకౌంటర్ :** పవిత్ర మక్కా యాత్ర హజ్ -2027 కు దరఖాస్తు చేసుకునేందుకు గడువు రేపటితో ముగియనున్నది. కేంద్ర హజ్ కమిటీ పెంచిన నాలుగు రోజుల గడువు శుక్రవారం(24 వ తేది )అర్ధరాత్రికి ముగుస్తుండడంతో హజ్ యాత్ర చేయాలనుకునే వారు గడువు ముగిసేలోగా దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు. హాజీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి ఫరూక్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పవిత్ర మక్కా యాత్ర హజ్ -2027కు ఇప్పటివరకు (బుధవారం)2421 మంది యాత్రికులు ఆన్ లైన్ ద్వారా తమ తమ పూర్తి వివరాలతో కేంద్ర హజ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన "షార్ట్ హజ్" ఆప్షన్ ద్వారా కుదించబడిన 20 రోజుల హజ్ యాత్ర కోసం 388 మంది హాజీలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చే ప్రయాణికులందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ. లక్ష ఆర్థిక సాయం కు విశేష స్పందన లభిస్తున్నదని అన్నారు. హజ్ -2026 యాత్రలో గన్నవరం విమానాశ్రయం నుంచివెళ్లి విజయవంతంగా హజ్ యాత్ర పూర్తి చేసి వచ్చిన 331 మంది ప్రయాణికుల కు రూ. 3.31 కోట్లు మొత్తాన్ని వారి అకౌంట్లకు జమ చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తున్న క్రమంలో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చే వారి సంఖ్య కూడా పెరిగిందన్నారు. హజ్ -2027 యాత్ర కోసం 517 మంది యాత్రికులు విజయవాడకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడమే ఇందుకు నిదర్శనమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కేంద్ర హజ్ కమిటీ నిర్ణయం మేరకు పొడిగించబడిన హజ్ యాత్ర దరఖాస్తు గడువును మక్కా యాత్ర చేయాలనుకునే వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గడువులోగా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని, విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయం పొందాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.

# విష్ణు సహస్ర నామ పారాయణం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో మచిలీపట్నం సర్కిల్ పేటలో వేంచేసిన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం మహిళా భక్తులు విష్ణు సహస్రనామ పారాయణ, కృష్ణాష్టకము, లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. 20 మందికి పైగా మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హారతి, ప్రసాద వినియోగం జరిగింది. లాటరీ విధానంలో పారాయణలో పాల్గొన్న మహిళలలో ఒక మహిళకు నూతన వస్త్రాలు బహుకరించారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ బహుకరించిన నూతన వస్త్రాలను లక్కీ డిప్ విజేతకు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన మహిళలకు డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కూనప రెడ్డి శ్రీనివాసరావు, ధర్మకర్త జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం , అయ్యప్ప, ఆలయ పూజారి శేషు తదితరులు పాల్గొన్నారు. ప్రతి బుధవారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

## శ్రీ భూ వారాహి అలంకారములో దర్శనమిచ్చిన బగలాముఖి అమ్మవారు

రెండు లక్షల విలువైన రెండు వస్తువులు బాపట్ల ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేత









**చందోలు (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** చందోలు శ్రీ బగలాముఖి అమ్మవారి ఆలయంలో గత ఏడు రోజులుగా జరుగుచున్న శ్రీ వారాహి నవరాత్ర మహోత్సవ కార్యక్రమాలలో ఎనిమిదవరోజు శ్రీ భూ వారాహి అలంకారములో అమ్మవారిని అనేక మంది భక్తులు దర్శించుకున్నారు గుంటూరు, తెనాలి వంటి గ్రామీణ ప్రాంతాలనుండి మహిళభక్తులు తండోపతండాలుగా విచ్చేసి అమ్మవారికి ఆషాడం సారె సమర్పించారు గుంటూరుకు చెందిన గోలి శ్రీనివాస దంపతులు 230000 విలువైన వెండి పూజా వస్తువులు బాపట్ల శాసనసభ్యులు శ్రీ వేగేసిన నరేంద్ర వర్మ రాజ చేతులమీదుగా దేవస్థానం కార్యనిర్వహణాధి గారికి అందజేశారు ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ కొద్ది కాలంలో ఎంతో అభివృద్ధిలోకి వచ్చిన ఈ గ్రామీణ ప్రాంత ప్రాచీన దేవాలయానికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయుటకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని దేవస్థానం అభివృద్ధికి చేయవలసిన అన్ని ఏర్పాట్లు చేయమని తగు సూచనలు చేశారు చందోలు ఎన్ఎస్ఎల్ కంపెనీ మహిళా గృహిణులు కోలాట నృత్యం భక్తులను ఆకట్టుకుంది విజయ వాడ కు చెందిన పోలీస్ ఉన్నతాధికారుల బృందం అమ్మవారిని దర్శించుకున్నారు ఈ గ్రంథంలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు ఐదుగురు డిఎస్పీలు ఉండటం గమనారాహం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అన్ని విధాల దర్శనం ఏర్పాట్లు అన్నప్రసాద వినియోగం జరిపించామని దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ శ్రీ కలకోట చక్రధర్ రెడ్డి ఈవో జి నరసింహమూర్తి తెలియపరిచారు.

## బ్రహ్మాయజ్ఞం పురోహిత స్మార్త పరీక్షలు విజయవంతం చేయండి

● రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు శిష్టా శేషగిరి మణికంఠ శర్మ



**వాసవీ పెనుగొండ,కలంకౌంటర్ :** తూర్పుగోదావరి జిల్లా ద్వారపూడి లో జరిగే పురోహిత బ్రాహ్మణులు ఆగస్టు 3, 4 తేదీల్లో "బ్రహ్మాయజ్ఞం పరీక్షలను విజయవంతం చేయాలని రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు శిష్టా శేషగిరి మణికంఠ శర్మ పిలుపు నిచ్చారు ఆగస్టు మూడు, నాలుగు తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా విభాగం మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో రెండు రోజులపాటు పురోహిత బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లిబ్రహ్మాయజ్ఞం (స్మార్త పరీక్షలు) పరీక్షలను విజయవంతం చేయాలన్నారు ఉభయ తెలుగు రాష్ట్రాల పురోహిత బ్రాహ్మణులు వచ్చి పరీక్షల్లో పాల్గొని సత్తా చాటాలని మణికంఠ శర్మ కోరారు

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**కందుకూరు, కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశముల మేరకు కందుకూరు డిఎస్పి సూచనలతో కందుకూరు సిఐ అన్వర్ భాష ఆధ్వర్యంలో కందుకూరు రూరల్ ఎస్సై బాలకృష్ణ వారి సిబ్బంది బుధవారం కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామం పరిధిలోని పొలములలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు రైడ్ చెయ్యగా అక్కడ కోతముక్క ఆడుతున్నటువంటి 14 మందిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి రూ. 1,02,000 /- నగదు, 14 మొబైల్ ఫోన్స్ మరియు10 మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకొని కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం అయినది. ఈ సందర్భంగా కందుకూరు డిఎస్పి గారు మాట్లాడుతూ ఎవరైనా పేకాట గాని కోడి పందెములు గాని మరియు ఇతర ఏదైనా జూద క్రీడలు ఆడినట్లయితే కనుక వారిని పట్టుకుని వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొనబడతాదని తెలియజేసినారు.

## జగన్‌కు పొగాకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు...
## నీ హయాంలో కంటితుడుపు చర్యలే --
## మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

అందరూ అలాగే వ్యవహరిస్తారని భ్రమపడుతున్నావు. అదే నీ రాజకీయ ఆలోచనా విధానానికి నిదర్శనం. రైతుల ప్రయోజనాల కోసం పారదర్శకంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలి. వర్జీనియా పొగాకు ధరల పతనం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల కాదు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గుదల, ఎగుమతులపై ఏర్పడిన ప్రతికూల ప్రభావం, దేశీయంగా జీఎస్టీ పెరుగుదల వంటి అనేక జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలే దీనికి ప్రధాన కారణాలు. ఈ వాస్తవాలను తెలిసినా ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం జగన్ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం కంటే, ఐదేళ్ల నీ పాలనలో పొగాకు రైతుల కోసం ఏం చేశావో ప్రజలకు చెప్పడం మంచిది. ఇప్పుడు రైతుల సంక్షేమంపై నీతులు చెప్పడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వాస్తవాలు తెలియకుండా మాట్లాడుతున్నావా? లేక తెలిసే రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారం చేస్తున్నావా? అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. రైతుల కష్టాలను రాజకీయాలకు వాడుకోవడం మానేసి, నిజాలను అంగీకరించే ధైర్యం చూపాలని గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్‌కు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు.

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
కలంకౌంటర్ దినపత్రిక లో
యాడ్స్ కోసం సంప్రదించండి..
సెల్ : 9346935672





కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరిని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. మణిపాల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి.. బ్రహ్మం చౌదరిని కలిశారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. బ్రహ్మం మాట్లాడుతూ ప్రస్తుతం అంతా బాగానే ఉందని తెలిపారు. మణిపాల్ వైద్యులతో లోకేష్ మాట్లాడగా బ్రహ్మం చౌదరి పూర్తిగా కోలుకున్నారని, త్వరలో డిశ్చార్జ్ చేస్తామని వారు తెలిపారు. బ్రహ్మం చౌదరి సతీమణి గౌతమి శ్వేతతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

–విజయవాడ,కలంకౌంటర్ :

# భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష





**అమరావతి,కలంకౌంటర్ :** సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులు, విజయనగరం జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశం ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమంకు విచ్చేస్తున్న క్రమంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగాలి జన సమీకరణ, ఆహారం, పార్కింగ్, రవాణా సదుపాయం వంటి అంశాలపై చర్చించిన మంత్రులు ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేసి సభను విజయవంతం చేయాలని పిలుపు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు అచ్చెన్నాయుడు, పి.నారాయణ, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వంగలపూడి అనిత, సత్య కుమార్ యాదవ్, గుమ్మడి సంధ్యారాణి, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవి కుమార్, స్పెషల్ సిఎస్ ఎం. టీ కృష్ణ బాబు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర యాదవ్, సత్యనారాయణ రాజు, హరి ప్రసాద్, మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఇతర ఉన్నత అధికారులు, తదితరులు

# రాయలసీమ నీటి సమస్యలపై వైఎస్సార్‌సీపీ స్టేట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం

- తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచే కార్యాచరణపై చర్చ
- అల్మట్టి ఎత్తు పెంపుతో రాయలసీమ ప్రయోజనాలకు తీవ్ర నష్టం: నేతల ఆందోళన

**తాడేపల్లి,కలంకౌంటర్ :** రాయలసీమలో నెలకొన్న నీటి సమస్యలు, తీవ్ర వర్షాభావ పరిస్థితులు, రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ బుధవారం సమావేశమైంది. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ కన్వీనర్ సాకే శైలజానాథ్, కమిటీ సభ్యులు అనంత వెంకట్రామిరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. రాయలసీమ జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతాంగానికి అండగా నిలిచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, జలాశయాల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, వ్యవసాయ బోర్లు పనిచేయక రైతులు పెట్టుబడులు కోల్పోతున్నారని నేతలు పేర్కొన్నారు. కరవు పరిస్థితుల కారణంగా పశుగ్రాసం, తాగునీటి సమస్యలు కూడా తీవ్రమవుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



**అల్మట్టి ఎత్తు పెంపుతో రాయలసీమకు తీవ్ర నష్టం..** అల్మట్టి జలాశయం ఎత్తు పెంపు ప్రతిపాదన వల్ల దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు, ప్రత్యేకించి రాయలసీమ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా జలాలపై ఆధారపడిన రాయలసీమ ప్రాజెక్టులకు సకాలంలో నీరు చేరకుండా పోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అల్మట్టి ఎత్తు పెంపు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా న్యాయపరంగా, సాంకేతికంగా బలమైన వాదనలు వినిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, సంబంధిత జలవనరుల సంస్థల వద్ద గట్టిగా పోరాడాలని స్పష్టం చేశారు. రాయలసీమకు నష్టం కలిగించే ఏ నిర్ణయాన్నీ సహించబోమని నేతలు తేల్చిచెప్పారు.

**రాయలసీమ లిఫ్ట్‌పై జిల్లా స్థాయి కార్యక్రమాల సమీక్ష..** రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సాధన కోసం వైఎస్సార్–సీపీ ఆధ్వర్యంలో జిల్లాల వారీగా చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. ఇప్పటికే నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశాలు, రైతులు--నీటిపారుదల రంగ నిపుణులతో చర్చలు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాలపై నేతలు చర్చించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆ ప్రాంతానికి అత్యంత కీలకమని, దానిని రాజకీయ కారణాలతో పక్కనపెట్టడం సరికాదని సమావేశం అభిప్రాయపడింది. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, అవసరమైన అనుమతులు సాధించి, రాయలసీమకు న్యాయంగా దక్కాల్సిన నీటిని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

**పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలి..** రాయలసీమలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, కాలువల ఆధునికీకరణ, జలాశయాల సామర్థ్యం పెంపు, చెరువుల పునరుద్ధరణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని నేతలు కోరారు. హంద్రీ--నీవా, గాలేరు--నగరి, వెలిగొండతో పాటు రాయలసీమకు ప్రయోజనం చేకూర్చే అన్ని సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను విడుదల చేసి, పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు హంద్రీ నీవాలో నాసిరకంగా చేసిన పనులపై ప్రభుత్వం విచారణ జరపాలని మరోసారి డిమాండ్ చేశారు. నీటి కేటాయింపులు ఉన్నా వాటిని వినియోగించుకునేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోతే రాయలసీమకు న్యాయం జరగదని పేర్కొన్నారు. కొత్త ప్రాజెక్టుల పేరుతో కాలయాపన చేయకుండా ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.

**రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి..** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే సమగ్ర కరవు అంచనాలు చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడం, పంట రుణాలను రీషెడ్యూల్ చేయడం, కొత్త రుణాలు మంజూరు చేయడం, వడ్డీ భారాన్ని తగ్గించడం, పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయడం, గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది. రాయలసీమ రైతాంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజలను భాగస్వాములను చేస్తూ ఉద్యమ కార్యాచరణను మరింత ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. జిల్లాల వారీగా రైతులు, రైతు సంఘాలు, నీటిపారుదల రంగ నిపుణులు, ప్రజాసంఘాలతో సమావేశాలు నిర్వహించి రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై విస్తృత చర్చ చేపట్టాలని నేతలు నిర్ణయించారు. రాయలసీమ నీటి హక్కులు, రైతాంగ ప్రయోజనాల పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ఈ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని సమావేశం స్పష్టం చేసింది.

# స్వచ్ఛతలో కర్నూలును అగ్రస్థానంలో నిలపాలి

- సమన్వయంతో వ్యర్థాల నిర్వహణ చేపట్టాలి
- ప్రైవేటు సెప్టిక్ ట్యాంకులకు జీపీఎస్ అమర్చాలి
- పారిశుద్ధ్య కార్మికుల అల్పాహారానికి సన్నాహాలు
- స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

**కర్నూలు,కలంకౌంటర్ :** కర్నూలు నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మున్సిపల్ యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సూచించారు. స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి జిల్లాలోని మున్సిపల్, పబ్లిక్ హెల్త్, గ్రామీణ పారిశుద్ధ్య శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జొహరాపురం డంప్‌యార్డులో బయో మైనింగ్ ప్రక్రియను, గార్గేయపురం డంప్‌యార్డులో బయో మైనింగ్ పనులతో పాటు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ప్రతిపాదిత స్థలాలను కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను నిర్మిస్తున్నామని తెలిపారు. గార్గేయపురం డంప్‌యార్డులో నిర్మించే ప్లాంట్‌లో కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాలకు చెందిన 12 మున్సిపాలిటీల నుంచి వచ్చే వ్యర్థాలతో 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే 15 ఎకరాల భూమిని కేటాయించామని, రానున్న 18 నెలల్లో పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గార్గేయపురం డంప్‌యార్డులో 9.5 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని, రోజుకు 200 టన్నుల వ్యర్థాలను శుద్ధి చేసి తడి వ్యర్థాలను ఎరువుగా, పొడి వ్యర్థాలను రీసైక్లింగ్‌కు వినియోగించే విధంగా ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉదయం విధులకు హాజరయ్యే పారిశుద్ధ్య కార్మికులు సమయానికి అల్పాహారం తీసుకోలేకపోతున్న నేపథ్యంలో అక్షయ పాత్ర సంస్థతో చర్చించి ప్రభుత్వ ఆధ్వర్యంలో అల్పాహారం అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, 'తల్లికి వందనం' పథకంలో పారిశుద్ధ్య కార్మికుల పిల్లలను కూడా ఈ ఏడాది నుంచి చేర్చామని, బుధవారం వారి ఖాతాల్లో నగదు జమ అయినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,000 ఈ–ఆటోలను కొనుగోలు చేస్తున్నామని, కర్నూలు నగరానికి 91 ఈ–ఆటోలను వచ్చే వారం నుంచి దశలవారీగా ఆగస్టు 15లోపు అందజేస్తామని తెలిపారు. ఈ–ఆటోల వినియోగానికి అవసరమైన చార్జింగ్, పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి, గుత్తేదారులతో సమన్వయం చేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమం విజయవంతంగా సాగిందని అభినందిస్తూ, కర్నూలు నగరపాలక సంస్థకు స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. బయో మైనింగ్ ద్వారా ప్రాసెసింగ్ చేసిన లెగసీ వ్యర్థాలను ఆగస్టు 15లోపు సంబంధిత సంస్థలకు తరలించాలని సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు. ప్రైవేటు సెప్టిక్ ట్యాంకుల ద్వారా సేకరించే వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారబోయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అన్ని వాహనాలకు వెంటనే జీపీఎస్ పరికరాలు అమర్చాలని ఆదేశించారు. సేకరించిన వ్యర్థాలను తప్పనిసరిగా దేవనగర్ ఎస్‌టీపీ వద్దనే డంపింగ్ చేయాలని స్పష్టం చేశారు. కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి మేరకు కర్నూలు నగరంలో చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మూడు కొత్త కంపాక్టర్లను మంజూరు చేస్తున్నట్లు పట్టాభిరామ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, పబ్లిక్ హెల్త్ ఈఈ గుర్రప్ప యాదవ్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్, ఎంటమాలజిస్ట్ సత్యనారాయణ, ఎంఈలు గిరిరాజ్, మనోహర్ రెడ్డి, డీఈఈలు వెంకటేశ్వర్లు, ఏఈ నాగేశ్వర్, పవన్ కుమార్ రెడ్డి, ఏఈలు వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు







**కావలి,కలంకౌంటర్ :** కావలి పురపాలక సంఘ ఉన్నత పాఠశాల పాత ఊరు నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కావలి వారిచే 64 మంది ఎన్సీసీ క్యాడేట్స్ కు ఉచిత రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత పాల్గొని ఎన్సిసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మీ రక్త గ్రూపులపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేస్తూ,రక్తదానంపై అవగాహన కల్పించి భవిష్యత్తులో ఎన్సిసి విద్యార్థులు అందరూ రక్త దాతలుగా మారాలని పిలుపునిచ్చారు. ఎన్సిసి అధికారి మస్తాన్వలి మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమములోప్రధానోపాధ్యాయులు సుజాత, ఎన్సిసి అధికారి మస్తాన్ వలి , టెక్నీషియన్స్ పద్మావతి, శేషమ్మ ,ఎన్సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు.

# 'క్రాప్ లైఫ్ ఇండియా' సేవలు అభినందనీయం..! : కలెక్టర్




**ఒంగోలు,కలంకౌంటర్ :** వ్యవసాయంలో ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ విధానాలను అవలంబించడంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ' క్రాప్ లైఫ్ ఇండియా ' స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ఢిల్లీకి చెందిన ఆ సంస్థ ప్రతినిధులు వరుణ్ వశిష్ట్, ఆశిష్ తివారీ గతవారం వలేటివారిపాలెం మండలం సమీరపాలెం గ్రామంలో ' పల్లెనిద్ర ' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ను కలిసి తమ సంస్థ తరఫున చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వ్యవసాయ శాఖ సహకారంతో జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ ఎరువుల రహిత సేద్యంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ సంస్థ కార్యక్రమాలను కలెక్టర్ ప్రశంసిస్తూ... విచక్షణారహితంగా ఎరువుల వినియోగం వలన ఆహార పదార్థాలలో వాటి అవక్షేపాలు ఉండి క్యాన్సర్ ప్రమాదానికి దారితీస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేలా క్రాప్ లైఫ్ ఇండియా విస్తృతంగా రైతులకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని చెప్పారు. కాగా, రబీ సీజన్ లో కూడా మరోసారి జిల్లావ్యాప్తంగా తాము పర్యటిస్తామని ప్రతినిధులు తెలిపారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు - ఎమ్మెల్యే నాగేశ్వరరావు

- తల్లికి వందనం ద్వారా 10 వేల కోట్లు విడుదల
- అలగాయపాలెం హైస్కూల్లో తరగతి గదులు ప్రారంభించిన ఎమ్మెల్యే
- 10 లక్షలతో భవనం నిర్మించిన హేచరీస్ యజమానులు



**కందుకూరు, కలంకౌంటర్ :** ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ అలగాయపాలెం జడ్పీ హైస్కూల్ లో... సుమారు 10 లక్షల రూపాయలు ఖర్చుతో నాలుగు గదులతో కూడిన రెండంతస్తుల భవనాన్ని హేచరీస్ యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్మించగా.... కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. P4 కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో ముందుకు వచ్చి, భవనాన్ని అన్ని వసతులతో నిర్మించిన దాతలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రాంతంలో వ్యాపారాలు చేసుకునేవారు, స్థానిక ప్రజల అవసరాలు గమనించి, ఆర్థికంగా తోడ్పాటు అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ద్వారా, రెండవ విడతగా బుధవారం రాష్ట్రంలో 67.50 లక్షల మంది విద్యార్థులకు 10,120 కోట్ల రూపాయలను తల్లుల ఖాతాలో జమ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటిలో ఎంతమంది చదువుతుంటే, అంతమందికి 15 వేలు చొప్పున ఇస్తున్నామన్నారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగులు అందించామన్నారు. మధ్యాహ్న భోజనం కూడా నాణ్యతతో పెడుతున్నామని చెప్పారు. ఉలవపాడు నుంచి అలాగాయపాలెం వరకు నడుస్తున్న ఆర్టీసీ బస్సును విద్యార్థుల కోసం, రెండు కిలోమీటర్ల దూరంలోని అంకమ్మపాలెం వరకు పొడిగించాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు, కరేడు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆదాము, హేచరీస్ యజమానులు సుబ్బాజీ, ఏవీఎస్ రాజు, పాటిబండ్ల మాల్యాద్రి, డిప్యూటీ డిఇఓ రవీంద్ర, ఎంఈఓ లు రత్నం, రమణయ్య, హైస్కూల్ హెచ్ఎం చంద్రమౌళి అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి కొల్లు రవీంద్రకు దస్తావేజు లేఖర్ల వినతిపత్రం



**మచిలీపట్నం,కలంకౌంటర్** : రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 396 జీవోను తక్షణం ఉపసంహరించాలని కోరుతూ దస్తావేజు లేఖరులు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రకు వినతి పత్రం సమర్పించారు. మచిలీపట్నం దస్తావేజుల లేఖరుల సంక్షేమ సంఘం సభ్యులు మంత్రిని కలిసి ఈ జీఓ కారణంగా తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేసారు. తగిన న్యాయం చేయాలని మంత్రిని కోరారు. సంక్షేమ సంఘం అధ్యక్షులు వాడపల్లి బాలాజీ సువర్ణకుమార్, ప్రధాన కార్యదర్శి సర్దార్ రహీం, ఉపాధ్యక్షులు నరహరిశెట్టి తుకారాం, వెంట్రప్రగడ వేణుగోపాలరావు, సీనియర్ లేఖర్లు దొంతు వెంకటేశ్వర్లు, నున్నా ఇందుప్రసాద్, మల్లాప్రగడ యుగసారధి, పువ్వుల రమేష్, బోయిన దుర్గాప్రసాద్, ఆత్మూరి రాము, నూలు సత్యనారాయణ, మండా జయచంద్రకుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# దస్తావేజు లేఖర్లకు న్యాయవాదుల సంఘం మద్దతు

• మూడవ రోజూ కొనసాగిన పెన్ డౌన్





**మచిలీపట్నం,కలంకౌంటర్** : రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 396 జీవోను తక్షణం ఉపసంహరించాలని కోరుతూ దస్తావేజు లేఖరులు నిర్వహిస్తున్న పెన్‌డౌన్ కార్యక్రమం బుధవారం మూడవ రోజు కూడా కొనసాగింది. స్థానిక జిల్లా రిజిస్టారు వారి కార్యాలయం ఎదుట మచిలీపట్నం దస్తావేజుల లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన శిబిరాన్ని మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగల హరిబాబు నేతృత్వంలో న్యాయవాదుల బృందం సందర్శించి దస్తావేజుల లేఖరులకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. అనాదిగా దస్తావేజులు రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న దస్తావేజు లేఖరుల వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, సేవా కేంద్రాలు ఏర్పాటును తాము వ్యతిరేకిస్తున్నట్లు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగల హరిబాబు, వైస్ ప్రెసిడెంట్ డి. శివకుమార్, జనరల్ సెక్రటరీ ఎస్. లలితకుమారి, లైబ్రరీ సెక్రటరీ పి. ప్రకాష్, మాజీ జనరల్ సెక్రటరీ కె. రఘురామ్, సీనియర్ న్యాయవాదులు జి. ప్రకాశరావు, విజయ్‌కుమార్, జెజె నెహ్రూ, కె. నాగేశ్వరప్రసాద్, కమ్మిలి విజయకుమార్, న్యాయవాదులు పి.మురళీ కృష్ణ, గుమ్మడి విజయకుమారి, వంకా శరణ్య, జగత్‌శ్రీ, చిత్రపు లావణ్య, సీతా మహాలక్ష్మి, రెడ్డౌతు రమణ తదితరులు మాట్లాడుతూ జీవో 396 ను తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మూడవ రోజు విజయవంతంగా జరిగిన ఈ పెన్‌డౌన్ కార్యక్రమంలో దస్తావేజుల లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వాడపల్లి బాలాజీ సువర్ణకుమార్, ప్రధాన కార్యదర్శి సర్దార్ రహీం, ఉపాధ్యక్షులు నరహరిశెట్టి తుకారాం, వెంట్రప్రగడ వేణుగోపాలరావు, సీనియర్ లేఖర్లు దొంతు వెంకటేశ్వర్లు, నున్నా ఇందుప్రసాద్, మల్లాప్రగడ యుగసారధి, పువ్వుల రమేష్, బోయిన దుర్గాప్రసాద్, ఆత్మూరి రాము, నూలు సత్యనారాయణ, మండా జయచంద్రకుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మరిన్ని బీసీ గురుకులాలు

• రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత • బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం • బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధుల మంజూరు • కార్పొరేట్ విద్యా సంస్థల సీట్ల కంటే ఎంజేపీ సీట్లకే డిమాండ్ ఎక్కువ • ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10 కొత్త గురుకులాల ఏర్పాటు చేశాం • 6 బీసీ బాలికల గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ • వైసీపీ నాయకులు వాళ్లింటి ముందు రోడ్లు కూడా వేసుకోలేకపోయారు • వాళ్లా మమ్మల్ని విమర్శించేది..? • ససన్నకోట బీసీ గురుకుల జూనియర్ కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి సవిత



**రామగిరి/శ్రీసత్యసాయి,కలంకౌంటర్** : ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో పది కొత్త మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించామని, వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయ-ంబోతున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల సీట్ల కంటే ఎంజేపీ గురుకులాల సీట్లకే డిమాండ్ ఎక్కువ ఉందన్నారు. తమ ఇళ్ల ముందు రోడ్లు కూడా వేసుకోని వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం నసనకోట మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల జూనియర్ కళాశాలను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. నసన్నకోట బీసీ బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటుకు దివంగత నాయకులు పరిటాల రవి తన సొంత భూమి పది ఎకరాలను అందజేశారన్నారు. పరిటా రవి సేవా స్ఫూర్తి ఎందరికో మార్గదర్శకమన్నారు. నసన్నకోట బీసీ బాలికల గురుకుల పాఠశాలను తన సొంత నిధులు ఎమ్మెల్యే పరిటాల సునీత అభివృద్ధి చేస్తున్నారన్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. బీసీ బిడ్డలకు నాణ్యమైన విద్య, ఆహారం, రక్షణ కల్పిస్తోందన్నారు. బీసీ గురుకులాలు, హాస్టళ్లలో సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తరగతి గదులు, విశ్రాంతి గదుల్లో దోమలు చొరబడకుండా దోమ తెరలు ఏర్పాటు చేశామన్నారు. రుచికరమైన భోజనం అందించేలా సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

**ఎంజేపీ సీట్లకే డిమాండ్ ఎక్కువ..** అన్న ఎన్టీఆర్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గురుకుల విద్య నాంది పలికారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలను, కళాశాలలను విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన 2014 నాటికి నవ్యాంధ్రప్రదేశ్ లో కేవలం 32 బీసీ గురుకులాలు మాత్రమే ఉండేవన్నారు. 2014-19 మధ్య 75 బీసీ గురుకులాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా మరో కొత్తగా పది ఎంజేపీ స్కూళ్లను ప్రారంభించామన్నారు. వాటిలో అయిదు రాయలసీమలోనూ, మరో అయిదింటిని ఉత్తరాంధ్రలోనూ ఏర్పాటు చేశామన్నారు. వాటితో పాటు ఆరు బాలిక బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. నసన్నకోట బీసీ గురుకులాన్ని కూడా జూనియర్ కళాశాల అప్ గ్రేడ్ చేశామన్నారు. ఇవేకాక వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త బీసీ గురుకులాలు ఏర్పాటు చేయనున్నామని, డిమాండ్ ఉన్నచోట్ల వాటిని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల కంటే ఎంజేపీ గురుకులాల సీట్లకే డిమాండ్ అధికంగా ఉందని మంత్రి సవిత తెలిపారు.

**వాళ్లా మమ్మల్ని విమర్శించేది...** తమ ఇళ్ల ముందు రోడ్లు కూడా వేసుకోలేని వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపైనా, తమపైనా విమర్శలు గుప్పించడం విడ్డూరంగా ఉందని మంత్రి సవిత ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో గతంలో ఎన్నడూ జరగలేనంత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. నేడు తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎందరు బిడ్డలు ఉంటే అందరికీ రూ.13 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి కలిగేలా రూ.10,120.78 కోట్లను 42,70,802 మంది తల్లుల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. విద్యా మిత్ర కిట్లను కూడా ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. ఎంజేపీ గురుకులాల్లో క్రీడల అభివృద్ధి కోసం స్పోర్ట్స్ కిట్లు కూడా పంపిణీ చేశామని మంత్రి సవిత తెలిపారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ, నసన్నకోట బీసీ బాలకల గురుకులాన్ని జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేసినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి సవితకు ధన్యవాదాలు తెలియజేశారు.

# వైభవంగా వారాహి నవరాత్రోత్సవాలు

• శాస్త్రోక్తంగా శ్రీ సరస్వతి హోమం • ఆకట్టుకున్న సుందరకాండ గానామృతం





**మచిలీపట్నం,కలంకౌంటర్** : స్థానిక అజాద్ రోడ్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ వారాహి నవరాత్ర మహోత్సవాలలో భాగంగా 8వ రోజు రోజు బుధవారం ఉదయం విద్యార్థులందరికీ విద్యాబుద్ధులు, ఉన్నతిని కాంక్షిస్తూ శ్రీ సరస్వతి హోమం (బుధ గ్రహ హోమం) నిర్వహించారు. వారాహి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నీరాజన మంత్రపుష్పాలు తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. సాయంత్రం శ్రీ భగవాన్నామ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో సరస్వతుల పవన్ కుమార్ సుందరకాండ గానామృతాన్ని మృదు మధురంగా ఆలపించారు. రాత్రి నీరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. పొక్కునూరి హరనాథ శర్మ అవధాని బ్రహ్మత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ పాలకవర్గ సభ్యులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్,సామా వెంకటలక్ష్మీ కాంతారావు, బైసాని హయగ్రీవ రావు, ఉడత్తు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.











Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com